www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 23 అక్టోబర్ 2024

5

పశ్చిమ గోదావరి

భూ సమస్యలపై వినతుల స్వీకరణ

ప్రజాశక్తి - యలమంచిలి

రీ సర్వే పూర్తయిన గ్రామాలలో భూ సమస్యలపై వినతులు స్వీకరించుటకు మేడపాడు గ్రామంలో మంగళవారం గ్రామసభ నిర్వహించారు. మేడపాడు గ్రామంలోని జాయింట్ ఎల్ పిఎం మొత్తం 304లో 11 మంది రైతులు సబ్ డివిజన్‌కు దరఖాస్తులు రావటంపై, గ్రామ సర్వేయర్‌తో పాటు మిగిలిన రైతులకు అవగాహన కల్పించి వారి నుంచి కూడా జాయింట్ ఎల్ పిఎం సబ్ డివిజన్‌కు దరఖాస్తు చేయించవలసిందిగా తహశీల్దార్ గ్రంధి పవన్ కుమార్ ఆదేశించారు. రైతులు ఎవరికైనా విస్తీర్ణంలో వ్యత్యాసం ఉన్నా, జాయింట్ ఎల్పిఎం సబ్ డివిజన్ చేయవలసి ఉన్నా వారంతా తప్పకుండా ఈనెల 30లోపు తహశీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవలసిందిగా సూచించారు.



వినతులు స్వీకరిస్తున్న తహశీల్దార్

సాగునీటి సంఘాల ఎన్నికలు షురూ

జిల్లాలో 112 సంఘాల ఎన్నికలకు షెడ్యూల్ విడుదల

21న అన్ని నీటి వినియోగదారుల సంఘాలు, నీటి పంపిణీ కమిటీలకు, ప్రాజెక్ట్ కమిటీలకు నోటిఫికేషన్ జారీ

నవంబర్ 24 నుంచి 29వ తేదీ వరకు ఎన్నికల నిర్వహణ

జిల్లా కలెక్టర్ నాగరాణి



ప్రజాశక్తి - భీమవరం

సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికల ప్రక్రియ మొదలైంది. ఎన్నికల షెడ్యూల్‌ను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి విడుదల చేశారు. ఎన్నికల ప్రక్రియ మంగళవారం నుంచి ప్రారంభమై నవంబర్ 29వ తేదీతో ముగిస్తుందని తెలిపారు. దీనిలో భాగంగా ఆయా మండలాలకు తహశీల్దార్లను, జలవనరుల శాఖ ఎఇలను ఆథరైజ్డ్ అధికారులుగా నియమించారు. ఆయకట్లలో సర్వే నెంబర్ల వారీగా ఓటర్ల జాబితాలను సిద్ధం చేస్తామని తెలిపారు. జిల్లాలో మొత్తం 112 నీటి వినియోగదారుల సంఘాలు ఉండగా వీటిలో మేజర్ ఇరిగేషన్ పరిధిలో 98, మైనర్ ఇరిగేషన్ పరిధిలో 14 సంఘాలు ఉన్నాయన్నారు. ఈ నెల 22 నుండి 31వ తేదీ వరకు జలవనరుల శాఖ అధికృత అధికారి ద్వారా ప్రాదేశిక నియోజకవర్గాలవారీగా జాబితా సిద్ధం చేసి ఈ నెల 31న ప్రాదేశిక నియోజకవర్గాలను ప్రకటిస్తారని తెలిపారు. నవంబర్ 1, 2 తేదీల్లో అభ్యంతరాల ప్రకటన, 3వ తేదీన అభ్యంతరాలను పరిష్కారం, అనంతరం అదే రోజు ప్రాదేశిక నియోజకవర్గాల వారీగా జాబితా ప్రకటన చేస్తారన్నారు.

3న నీటి పంపిణీ సంఘాలకు ప్రాజెక్ట్ కమిటీ నోటిఫికేషన్

నవంబర్ 3న నీటి పంపిణీ సంఘాలకు, ప్రాజెక్ట్ కమిటీలకు నోటిఫికేషన్ విడుదల చేస్తామని కలెక్టర్ తెలిపారు. నవంబర్ 6 నుండి 10వ తేదీ వరకు భూయజమానుల జాబితా, ఓటర్ల జాబితాను ఆథరైజ్డ్ రెవెన్యూ అధికారుల ద్వారా తయారు చేస్తామన్నారు. నవంబర్ 11, 12 తేదీల్లో ఓటర్ల జాబితాపై అభ్యంతరాలను స్వీకరణ, 13న అభ్యంతరాల పరిష్కారం, అదే రోజు ప్రాదేశిక నియోజకవర్గాలవారీగా తుది ఓటర్ల జాబితా ప్రకటిస్తామని తెలిపారు. ఓటర్ల తుది జాబితాపై అభ్యంతరాలను నవంబర్ 14, 15 తేదీల్లో సంబంధిత ఆర్‌డిఒలకు సమర్పించాల్సి ఉంటుందని, 16, 17 తేదీల్లో అభ్యంతరాలు పరిష్కారం ఉంటుందని చెప్పారు. ఇంకా అభ్యంతరాలు ఉంటే కడా కమిషనర్ పరిధిలో నవంబర్ 18 నుండి 20వ తేదీ మధ్య పరిష్కరిస్తారని తెలిపారు. నవంబర్ 20న నీటి వినియోగదారుల సంఘాలు, నీటి పంపిణీ కమిటీలు, ప్రాజెక్టు కమిటీలకు ఎన్నికల ప్రక్రియ ప్రారంభిస్తామని, నవంబరు 21 నుండి 23వ తేదీ మధ్య అన్ని నీటి వినియోగదారుల సంఘాల్లోని సభ్యులు అధ్యక్ష ఉపాధ్యక్షులను ఎన్నుకుంటారని చెప్పారు. నవంబర్ 24 నుండి 26వ తేదీల మధ్య నీటి పంపిణీ సంఘాలకు, నవంబర్ 27 నుండి 29వ తేదీల మధ్య ప్రాజెక్టు కమిటీలకు ఎన్నికలు జరుగుతాయని జిల్లా కలెక్టర్ తెలిపారు.

టీచర్స్ ఎంఎల్‌సిగా గోపీమూర్తి గెలుపు బాధ్యత మీదే

ఉపాధ్యాయులతో పట్టభద్రుల ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు

మాట్లాడుతున్న ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - యలమంచిలి

ఉపాధ్యాయ ఎంఎల్‌సి స్థానానికి పిడిఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బొర్రా గోపీమూర్తిని గెలిపించవలసిన బాధ్యత ఉపాధ్యాయులదేనని ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు ఉపాధ్యాయులకు విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం కొంతేరు, కాజ, ఏనుగువానిలంక, చించినాడ, యలమంచిలి, మేడపాడు, శిరగాలపల్లి, ఐలపర్రు, మట్లపాలెం, గుంపర్రు, దొడ్డిపట్ల జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. కొంతేరులో ఎస్ఆర్.శంకరన్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం స్టాఫ్ మీటింగ్‌లో మాట్లాడుతుండగాపాటు ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. దీంతోపాటు పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్షలకు ఏవిధంగా సన్నద్ధం కావాలో సూచించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పోలిశెట్టి క్రాంతికుమార్, మండల అధ్యక్షులు గుత్తిందివి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి పంతం రామ్మూర్తినాయుడు, ప్రజా సంఘాల బాధ్యులు యర్రా అజయ్‌కుమార్, డి.సుధాకర్, పూర్వపు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సరిపల్లి జయప్రభ, గుమ్మాపు ప్రభాకర్, ఎస్ఎస్.అవధాని, పోతర్తి నరసింహారావు, కానేటి బాలరాజు, జి.రామాంజనేయులు పాల్గొన్నారు.

మొగల్తూరు: ఉపాధ్యాయుల సమస్యలు తెలుసుకుని పరిష్కరించి కృషి చేస్తానని యుటిఎఫ్ బలపర్చిన పిడిఎఫ్ టీచర్స్ ఎంఎల్‌సి అభ్యర్థి బొర్రా గోపీమూర్తి అన్నారు. మంగళవారం మొగల్తూరు మండలంలోని జెడ్‌పి హైస్కూల్‌ను ఆయన సందర్శించి ఉపాధ్యాయులతో మాట్లాడారు. తన విజయానికి సహకరించాలని ఆయన కోరారు. ఆయన వెంట యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు విజయరామరాజు, మండల అధ్యక్షులు చింతపల్లి కృష్ణమోహన్, జిల్లా మహిళా కార్యదర్శి పి.కృష్ణకుమారి, మండల కోశాధికారి కొల్లాటి బ్రహ్మయ్య, మండల సహాధ్యక్షులు అంగర మురళీధర్ తదితరులు ఉన్నారు.

భూసమస్యల పరిష్కారానికి చర్యలు

జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డు అధికారి జాషువా

ప్రజాశక్తి - పాలకోడేరు

భూముల రీసర్వేపై గ్రామసభల్లో వచ్చిన ప్రతి సమస్యనూ క్షుణ్ణంగా పరిష్కరించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డు అధికారి కె.జాషువా అన్నారు. పెన్నాడ అగ్రహారం సచివాలయం వద్ద మంగళవారం సర్పంచి చిల్లా అనూష అధ్యక్షతన రీసర్వే గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామసభల ముఖ్యోద్దేశాన్ని తహశీల్దార్ ఎన్.భారతి విజయలక్ష్మి, రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ సూర్యనారాయణరాజు వివరించారు. ఈ సందర్భంగా పెన్నాడ మాజీ సర్పంచి చేబోలు రామకృష్ణ, అడ్వకేట్ రమేష్ పలు భూసమస్యలు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం జాషువా మాట్లాడుతూ 1924లో బ్రిటీష్‌కాలంలో రీ సర్వే జరిగిందన్నారు. ప్రతి 30 ఏళ్లకు ఒకసారి రీసర్వే చేయాల్సి ఉందని, అయితే ఎవరూ పట్టించుకోకపోవడంతో అది అమలు కాలేదని చెప్పారు. సుమారు వందేళ్ల తర్వాత ప్రస్తుతం రీసర్వే జరుగుతుందన్నారు. జిల్లాలో 194 గ్రామాల్లో రీ సర్వే పూర్తయ్యిందని, మరో 174 గ్రామాల్లో సర్వే చేయాల్సి ఉందని చెప్పారు. రీసర్వే పూర్తయిన గ్రామాల్లో గ్రామ సభల ద్వారా భూసమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సర్పంచి చిల్లా అనూష మాట్లాడుతూ గ్రామంలో భూసమస్యలు అనేకం ఉన్నాయని, వీటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు. అనంతరం భూ సమస్యలకు సంబంధించి 23 ఫిర్యాదులు రైతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ శ్రీనివాస్, రెవెన్యూ అధికారి కె.రాఘవమూర్తిరాజు, పంచాయతీ కార్యదర్శి కనుమూరి వెంకటరాజు, విఆర్ఓ శ్రీనివాస్, సుబ్రహ్మణ్యం, గ్రామ సర్వేయర్ రాజేష్ ఈశ్వర్, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జాషువా

విద్యుత్ ఛార్జీల పెంపు తగదు

సిపిఎం ఆధ్వర్యాన వినతి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

విద్యుత్ ఛార్జీలు పెంపు నిర్ణయాన్ని స్మార్ట్ మీటర్లు పెట్టే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సిపిఎం మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం సిపిఎం ఆధ్వర్యంలో మండలంలోని తాడేరు విద్యుత్ కేంద్రం వద్ద విద్యుత్ ఛార్జీల పెంపు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ నిరసన తెలిపారు. అనంతరం జెఇ బి.ఏడుకొండలుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు పెంచబోమని ఇప్పుడు ఇదేం విధానమని ప్రశ్నించారు. కార్యక్రమంలో నేతల కృపాదానం, భూపతి తిమోతి, యాకోబు, యోహాను తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందిస్తున్న సిపిఎం నేతలు

నేడు 'డయల్ యువర్ డిఎం'

నరసాపురం : ఆర్‌టిసి ప్రయాణికుల సమస్యల పరిష్కారం, ప్రయాణికుల సూచనలు, సలహాల కోసం బుధవారం డయల్ యువర్ డిఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నరసాపురం ఆర్‌టిసి డిఎం ఎస్.సుబ్బన్నరెడ్డి తెలిపారు. ఈమేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. డయల్ యువర్ ఆర్‌టిసి డిఎం కార్యక్రమంలో భాగంగా ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకూ ప్రయాణికులు 99592 25486 నెంబర్‌కు ఫిర్యాదులు, సూచనలను తెలపాలని స్పష్టం చేశారు. ఆర్‌టిసి సిబ్బంది ద్వారా ఏమైనా ఇబ్బందులున్నా, కార్గో సర్వీస్‌లో ఇబ్బందులు, ప్రత్యేక బస్సులు తదితర సమస్యలపై ఫిర్యాదులు చేయవచ్చని పేర్కొన్నారు.

పార్టీ అభివృద్ధికి కృషి చేశా..

టిడిపి బిసి నాయకులు సూరిబాబు

భీమవరం టౌన్ : పార్టీ అభివృద్ధితోపాటు విజయానికి ఎంతో కష్టపడితే తనకు ఇచ్చే గౌరవం ఇదేనా అని జిల్లా గౌడ సాధికారత సమితి కన్వీనర్, టిడిపి బిసి నాయకుడు వీరమల్లు సూర్యచంద్రరావు(సూరిబాబు) అన్నారు. తాడేరు టిడిపి గ్రామ అధ్యక్షుడు అంగర వెంకట్ ఏకపక్షంగా వ్యవహరిస్తూ గ్రామంలో పార్టీ క్యాడర్‌కు ఇబ్బందిగా మారారని ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయాన్ని టిడిపి గ్రామ ఉపాధ్యక్షుడు తిరుమల తులసీరావు భీమవరం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి తోట సీతారామలక్ష్మి దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయంపై చర్చిస్తుండగా అంగర వెంకట్‌కు అనుకూలంగా టిడిపి రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి మాట్లాడుతూ వీరమల్లు సూరిబాబుపై పరుష పదజాలంతో దూషించారు. అనంతరం సూరిబాబు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 'నిన్ను మురుగు కాలువలో వేసి తొక్కి చంపేస్తా..' అని నోటికి వచ్చిన బూతులు తిట్టారని వాపోయారు. పార్టీకి డబ్బులు ఖర్చుపెట్టి సేవ చేయడం తప్పా అని ప్రశ్నించారు. టిడిపి కోసం తాను పడిన కష్టానికి ఇచ్చే గౌరవం ఇదేనా అంటూ తీవ్ర మనస్థాపానికి గురయ్యారు. పార్టీని నమ్ముకున్న వాళ్లపై.. పార్టీని అమ్ముకునే వాళ్లు దాడిచేయడం దారుణమని మండిపడ్డారు. పార్టీ కోసం అహర్నిశలు శ్రమించడం తప్ప మరొకటి తెలియని బిసి సూరిబాబుపై దాడిని బిసి సంఘాల నాయకులు తీవ్రంగా ఖండిస్తున్నారు.

వైసిపి హయాంలో కుంటుపడిన అభివృద్ధి

ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ

ప్రజాశక్తి - తణుకు

గత ప్రభుత్వంలో తణుకు మున్సిపాలిటీ అభివృద్ధిని నిర్లక్ష్యం చేశారని తణుకు నియోజకవర్గ ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. మంగళవారం స్థానిక 22వ వార్డులో ప్రజా సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు, సమస్యల నుంచి విముక్తి చేసేందుకు గ్రామదర్శిని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆరిమిల్లి వార్డు పర్యటనలో పాల్గొని స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గత ఐదు సంవత్సరాలుగా ప్రతి వార్డుల్లోనూ, డ్రెయినేజీల్లో సిల్ట్ తీయలేదని, డ్రెయినేజీలు పూర్తిగా పాడైపోయి ఉన్నాయన్నారు. డ్రెయినేజీలు పూడిక తీయకపోవడంతో కొద్దిపాటి వర్షం వచ్చినా రోడ్లు అన్నీ మునిగిపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇటువంటి సమస్యలతో ఉన్న ఈ వార్డు నల్లజర్ల వీధికి సంబంధించి రూ.23 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టడానికి వెంటనే చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వార్డులో ప్రజలందరూ కూడా సహకరించాలని, ఖాళీ స్థలం ఉన్న యజమానులు మొక్కలను, చెత్తను పూర్తిగా తొలగించే బాధ్యతను తీసుకోవాలన్నారు. తణుకు పట్టణంలోని అన్ని వార్డుల్లో అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. 15వ ఆర్థికసంఘం నిధుల్లో భాగంగా కోటి రూపాయల నిధులతో పలు వార్డుల్లో డ్రెయినేజీ నిర్మాణానికి ప్రతిపాదన పంపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి కూటమి నాయకులు పాల్గొన్నారు.

డ్రెయినేజీని పరిశీలిస్తున్న ఆరిమిల్లి రాధాకృష్ణ

జిల్లా వ్యాప్తంగా 30.45 లక్షల పని దినాలు

ఉపాధి పనుల కల్పనలో రాష్ట్రంలో జిల్లాకు 8వ స్థానం

వలసల నిరోధానికి కృషి చేయాలి

కలెక్టర్ సిహెచ్.నాగరాణి

మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి 42 లక్షల పని దినాలు కల్పన లక్ష్యంగా తీసుకోగా ఇప్పటి వరకు 30,48,005 పని దినాలను కల్పించి 72.57 శాతంతో రాష్ట్రంలో ఎనిమిదో స్థానంలో నిలిచామని జిల్లా కలెక్టర్ నాగరాణి తెలిపారు. స్థానిక కలెక్టరేట్లో మంగళవారం అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి ఆమె మాట్లాడారు. జిల్లాలో అత్యధికంగా పాలకొల్లు మండలంలో 91.94 శాతం పని దినాలను కల్పించగా, అత్యల్పంగా వీరవాసరం మండలంలో 64.76 శాతం పని దినాలు కల్పించారన్నారు. పేదలకు మరిన్ని పని దినాలు కల్పన ద్వారా ఇతర దేశాలకు వలసలను నిరోధించవచ్చని, ఈ విధంగా ఆలోచన చేసి ఎక్కువ పని దినాలను కల్పించాలని సూచించారు. కొబ్బరి చెట్లు, మామిడి చెట్లు చుట్టూ ట్రెంచ్ (గాడి తవ్వకం) పనులను ఉపాధి కూలీల ద్వారా చేపట్టాలన్నారు. ప్రతి కుటుంబానికీ వంద రోజుల ఉపాధి లక్ష్యాన్ని ఎట్టి పరిస్థితుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో మంజూరైన 850 పశువుల షెడ్లకు రూపొందించి ప్రతిపాదనలను వెంటనే సమర్పించాలన్నారు. జాబ్‌కార్డుల అప్‌డేషన్ ప్రక్రియను ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పూర్తి చేయాలన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఉద్యాన పంటల సాగుకు 15 మండలాల్లో 200 ఎకరాల్లో ప్లాంటేషన్ చేపట్టాల్సి ఉండగా, 158 ఎకరాల్లో ప్లాంటేషన్ పూర్తి చేశారన్నారు. సమావేశంలో డ్వామా పీడీ డాక్టర్ కెసిహెచ్.అప్పారావు, జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి కె.మురళీకృష్ణ, ఆర్‌డబ్ల్యుఎస్ జిల్లా అధికారి బివివి.నాగేశ్వరరావు, జిల్లా పంచాయతీరాజ్ శాఖాధికారి కెఎస్ఎస్.శ్రీనివాసరావు, జిల్లా అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ పి.శ్యాంసుందర్, ఎపీడీలు పి.సుజాత, ఎవి.ప్రసాద్, ఎపిఒ సిబిజె.కనకదుర్గ, ఎంపిడిఒలు తదితరులు పాల్గొన్నారు.

క్లాప్ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి

సిఐటియు జిల్లా కార్యదర్శి పివి ప్రతాప్

మోకాళ్లపై నిరసన తెలుపుతున్న క్లాప్ డ్రైవర్లు

ప్రజాశక్తి - తణుకు

మున్సిపల్ క్లాప్ డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి ప్రతాప్, మండల కార్యదర్శి గుబ్బల గోపి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న గాంధీ విగ్రహం వద్ద మోకాళ్లపై నిలబడి నిరసన తెలియజేస్తూ గాంధీ విగ్రహానికి వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి సూపరింటిండెట్ ఎన్.శ్రీదేవికి డిమాండ్స్‌తో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. క్లాప్ డ్రైవర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, పెండింగ్ వేతనాలు, పిఎఫ్ బకాయిలు చెల్లించాలని, జిఒ 36 ప్రకారం రూ.24,500 ఇవ్వాలని, కార్మిక చట్టాలు అమలు చేయాలని, తొలగింపులు, రాజకీయ వేధింపులు ఆపాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ప్రతాప్, గోపిలు మాట్లాడుతూ గత 3 సంవత్సరాల నుంచి మున్సిపాలిటీలో పారిశుధ్య విభాగంలో క్లాప్ డ్రైవర్లుగా పని చేస్తున్నారన్నారు. ప్రభుత్వం మారింది కాబట్టి తొలగిస్తామని చెప్పడం చట్ట వ్యతిరేకమన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు లేకపోయినా ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఉన్నా పనిచేశారన్నారు. గత ప్రభుత్వం కార్మికులను పట్టించుకోకపోవడం వల్ల ఎన్నో ఆశలు పెట్టుకుని నూతన కూటమి ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకొచ్చారని పేర్కొన్నారు. క్లాప్ డ్రైవర్లకు న్యాయమైన సమస్యలు పరిష్కారం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు సీనియర్ నాయకులు గార రంగారావు, సురేంద్ర, గణేష్, కేశవరావు, నాని తాతారావు, రాంబాబు, శేఖర్, హరి, సుధాకర్, ఎల్లారావు, చిన్న, భరద్వాజ పాల్గొన్నారు.

గాంధీ విగ్రహానికి వినతిని అందజేస్తున్న క్లాప్ డ్రైవర్లు

కల్లుగీత వృత్తి పట్ల ప్రభుత్వ వైఖరి స్పష్టం చేయాలి

ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చాలి

గీత కుటుంబాలను చిన్నచూపు చూడటం దారుణం

ఎపి కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నరసింహామూర్తి

మాట్లాడుతున్న నరసింహామూర్తి

ప్రజాశక్తి - భీమవరం

మద్యం ఆదాయం కోసం పరోక్షంగా బెల్ట్‌షాపులు, ఎన్‌డిపి మద్యాన్ని ప్రోత్సహించి కల్లు అమ్మకాలను దెబ్బతీయాలని తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అనుకుంటే గీత కార్మికులు చూస్తూ ఊరుకోబోరని ఎపి కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నరసింహామూర్తి హెచ్చరించారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో మంగళవారం సంఘం జిల్లా కమిటీ సమావేశం జిల్లా ఉపాధ్యక్షులు కడలి పాండు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నరసింహామూర్తి మాట్లాడారు. రసాయనాలతో తయారైన బీరు, బ్రాందీ, విస్కీలకు ఇస్తున్న ప్రాధాన్యత ప్రకృతి సహజసిద్ధమైన తాటికల్లుకు ఇవ్వకపోవడం ఆశ్చర్యం కలిగిస్తుందన్నారు. ఎన్నికల్లో గీత కార్మికులు అడగకుండా ఓట్ల కోసం వాగ్దానాల వర్షం కురిపించారన్నారు. అయితే వాటిని అమలు చేయడానికి ఎందుకు ఆలోచిస్తున్నారని ప్రశ్నించారు. నాణ్యమైన మద్యం రూ.99కే ఇస్తామని ఊదరగొట్టడం ద్వారా జనాన్ని తాగుబోతులు చేసే ప్రభుత్వం ఆదాయం పెంచుకునే ఎత్తుగడన్నారు. కేరళ రాష్ట్ర ప్రభుత్వం మద్యం ఆదాయంపై ఆధారపడకుండా గీతవృత్తిని ప్రోత్సహిస్తుందని తెలిపారు. మన రాష్ట్ర ప్రభుత్వం గీత కార్మిక కుటుంబాలను చిన్నచూపు చూస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వృత్తిలో ఉపాధి పెంచేలా తాడిచెట్టుపై హక్కు ఉండేలా రూ.10 చొప్పున కట్టించుకునేలా కల్లు పాలసీని రూపొందించాలన్నారు. 2015లో చంద్రబాబు ఎక్స్‌గ్రేషియాను రద్దు చేయడం వల్ల వేలాది గీత కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నాయని గుర్తు చేశారు. ప్రమాదం జరిగిన నెల రోజుల్లో రూ.10 లక్షల చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేశారు. వృత్తిలో ప్రమాదాలు నివారించేందుకు వారందరికీ సేఫ్టీ మోకులు ఇవ్వాలని, అన్ని జిల్లా కేంద్రాల్లో నీరా క్యాంపులు పెట్టాలని, వృత్తి చేస్తూ మృతి చెందిన వారి కుటుంబానికి దహన సంస్కారాలకు రూ.50 వేలు, గాయపడిన వారికి వైద్య ఖర్చులకు రూ.25 వేలు ఇవ్వాలని, గీత కార్మికుల సంక్షేమానికి బడ్జెట్లో రూ.5 వేల కోట్లు కేటాయించి టాడి కార్పొరేషన్‌ను సమర్థవంతంగా పనిచేయించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో జిల్లా నాయకులు బొక్కా చంటి, దాసరి సూరిబాబు, బొంతు శ్రీనివాస్, కొండవీటి శ్రీనివాస్, చెల్లబోయిన వెంకటేశ్వరరావు, చింతపల్లి చిన్న వీరయ్యస్వామి, దొంగ సత్యనారాయణ, ఆరేపల్లి వెంకటనారాయణ, అంగర రంగారావు పాల్గొన్నారు.

గ్రామసభల ద్వారా అన్ని సమస్యలు పరిష్కారం

తాడేపల్లిగూడెం ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం రూరల్

పల్లె పండుగ పేరుతో నిర్వహిస్తున్న గ్రామసభల ద్వారా గ్రామాల్లోని సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకు వెళుతుందని తాడేపల్లిగూడెం ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. గతంలో జరిగిన సర్వేలలో లోపాలను సరిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం ద్వారా గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ కృషి చేస్తున్నారని తెలిపారు. మంగళవారం వెంకటరామన్నగూడెంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గత సర్వేలలో జరిగిన పొరపాట్లను సరిదిద్దుకునేందుకు ప్రభుత్వం కృషిచేస్తుందని, ఇప్పటికే చాలామంది రైతులు తమ పొలం తక్కువగా ఉందని, మరి కొంతమందికి పాస్ బుక్‌లలో తమ పేరు లేకపోవడం వంటివి తమ దృష్టికి తీసుకువచ్చినట్టుగా తెలిపారు. పల్లె పండుగ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి గ్రామసభలు నిర్వహించడం ద్వారా ప్రతి ఒక్కరి సమస్యలను తీర్చే దిశగా అధికారులు పనిచేస్తున్నారన్నారు. ఎటువంటి సమస్యలైనా గ్రామసభల ద్వారా తీర్చేందుకు పల్లె పండుగ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారని, ఈ పల్లె పండుగ కార్యక్రమం ద్వారా గ్రామాల్లోని సమస్యలతో పాటు పని అభివృద్ధి కార్యక్రమాలు సైతం నియోజకవర్గంలో నిర్వహిస్తున్నట్లుగా తెలిపారు. గత ప్రభుత్వం గ్రామాల అభివృద్ధిని నిర్లక్ష్యం చేసిందని, అదే తప్పు పునరావృతం కాకుండా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ కృషి చేస్తున్నారన్నారు. ఆయనతో పాటు తాము కూడా ప్రతి గ్రామాభివృద్ధిలో తమ వంతుగా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. గ్రామాల సమస్యలను కూటమి నాయకుల ద్వారా ప్రతిరోజు తెలుసుకుంటున్నానని, గడిచిన వంద రోజుల్లో చేసిన గ్రామాల అభివృద్ధిని చూసి ప్రజా సహకారం కూడా ముందుకు వస్తుందని ఆశిస్తున్నట్లుగా తెలిపారు. తాము పుట్టిన గ్రామానికి సహాయం చేసేందుకు ఎవరు వచ్చినా స్వాగతం పలుకుతున్నామన్నారు. పార్టీలకు, రాజకీయాలు అతీతంగా గ్రామాభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నామని చెప్పుకొచ్చారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లిగూడెం ఆర్‌డిఒ భవాని శంకరి, తహశీల్దార్ సునీల్ కుమార్, జనసేన, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ప్రత్యేక మొబైల్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో ఏర్పాటుచేసిన ఆధార్ సవరణ ప్రత్యేక మొబైల్ క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, ఆధార్ లేని ఎరుకుల, యానాది కుటుంబాలు ఒక్కటి కూడా ఉండకూడదని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తహశీల్దార్లను ఆదేశించారు. ఈనెల 22 నుంచి 25 వరకు ఆధార్ ప్రత్యేక మొబైల్ క్యాంపులను జిల్లాలో నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లాలో నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం సచివాలయాలు, పాఠశాలలు, కళాశాలల, అంగన్వాడీ ప్రాంగణములలో ప్రత్యేక మొబైల్ ఆధార్ క్యాంపులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆధార్ సవరణ కార్యక్రమంలో భాగంగా కొత్తగా ఆధార్ నమోదు, ఐదు నుంచి 15 ఏళ్లు కలిగిన వారికి 15 నుంచి 17 ఏళ్ల వయసు కలిగిన వారికి తప్పనిసరిగా బయోమెట్రిక్ అప్డేషన్, డెమోగ్రాఫిక్ అప్డేట్, బయోమెట్రిక్ అప్డేట్, అలాగే డాక్యుమెంట్ అప్డేట్ సర్వీస్ వంటి సేవలను ఈ ప్రత్యేక క్యాంపుల ద్వారా పొందవచ్చు అన్నారు. జిల్లాలో మొత్తం 88 ఆధార్ కేంద్రాలలో ప్రత్యేక ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. క్యాంపులు ముగిసిన అనంతరం ఆయా కుటుంబాలలో ఆధార్ లేదని తన దృష్టికి వస్తే సంబంధిత అధికారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జాతీయ రహదారిపై మద్యం షాపులు!

నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు
పట్టించుకోని అధికారులు
సుదూర ప్రాంతాలకు తరలించాలని ప్రజల వేడుకోలు

జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన వైన్ షాప్

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా జాతీయ రహదారుని ఆనుకుని నూతన మద్యం షాపులు ఏర్పాటు చేశారు. గతంలో థామస్ బ్రిడ్జి వద్ద 216 జాతీయ రహదారిని అనుకుని మద్యం షాపు నడిచేది. మరలా రాయపేట థామస్ బ్రిడ్జి వద్ద నూతన మద్యం షాపుని ఏర్పాటు చేశారు. ధాన్యం బజార్‌లో కూడా ప్రభుత్వ మద్యం షాపులు నడిచేవి. వాటి స్థానాల్లోనే కొత్త మద్యం షాపులు ఏర్పాటు చేశారు. వీటివల్ల విద్యార్థులు, మహిళలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. థామస్ బ్రిడ్జి, ధాన్యం బజార్ వద్ద తరచూ ట్రాఫిక్ నిలిచిపోవడం, ప్రమాదాలు జరిగేవి. మరోవైపు అదే ప్రాంతాల్లో నూతన మద్యం షాపులు ఏర్పాటు చేయడంతో ప్రజల్లో ఆందోళన నెలకొంది. వ్యాపారులు తమ ఆదాయం పెంచుకునేందుకు నిబంధనలకు విరుద్ధంగా జాతీయ రహదారి వెంబడి ఏర్పాటు చేస్తున్న మద్యం షాపులు వేరే ప్రాంతాలకు తరలించాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, జాతీయ రహదారుల సమీపంలో మద్యం షాపులు ఏర్పాటు చేస్తుంటే అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవట్లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. థామస్ బ్రిడ్జి వద్ద ఏర్పాటుచేసిన వైన్‌షాప్ సమీపంలో నరసాపురం మండల పరిషత్ కార్యాలయం, ప్రభుత్వ పశువైద్యశాల, మున్సిపల్ హైస్కూల్, ప్రైమరీ స్కూల్స్ ఉన్నాయి. నరసాపురం సబ్ కలెక్టర్ కార్యాలయం, డిఎస్‌పి కార్యాలయం మధ్య వైన్‌షాప్ ఏర్పాటు చేసినా అధికారులు స్పందించకపోవడం ఏంటని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మద్యం షాపులు వేరే ప్రాంతాలకు తరలించాలని కోరుతున్నారు.

నిబంధనలు: 1.విద్యాసంస్థలు, ఆసుపత్రులు, ప్రార్థనా మందిరాలకు వంద మీటర్ల లోగా మద్యం దుకాణాలు ఏర్పాటు చేయకూడదు.
2. జాతీయ రహదారి, రాష్ట్ర రహదారులకు 500 మీటర్ల దూరంలో షాపులు ఏర్పాటు చేయాలి. హైవేలపై మద్యం దుకాణం ఉందని తెలియజేసేందుకు ఏవిధమైన సైన్ బోర్డులు, ప్రకటన బోర్డులు ఏర్పాటు చేయకూడదు.
3.మండల కేంద్రంలో 20 వేల కంటే తక్కువ జనాభా ఉంటే, స్టేట్ హైవేలకు 220 మీటర్ల దూరంలో మద్యం దుకాణం పెట్టుకోవచ్చు.
4.మండలాన్ని ఒక యూనిట్‌గాను, మున్సిపాలిటీ, నగర కార్పొరేషన్లను ఒక యూనిట్‌గా తీసుకుని మద్యం దుకాణం ఎక్కడైనా ఏర్పాటు చేసుకునే వెసులుబాటు ఉంది.
5.మద్యం దుకాణాల్లో ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకూ మాత్రమే విక్రయాలు సాగించాలి. బార్లకు ఉదయం 11 నుంచి రాత్రి 11 గంటల వరకూ అనుమతి ఉంటుంది.

జాబ్ మేళాలో 25 మంది ఎంపిక

ప్రజాశక్తి - ఆచంట

ఆచంటలోని ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, నేషనల్ కెరీర్ సర్వీస్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన జాబ్ మేళాలో 25 మంది అభ్యర్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ప్రిన్సిపల్ ఇందుకూరి వెంకట సత్యనారాయణ రాజు తెలిపారు. ఈ జాబ్ మేళాలో ఎయిర్‌టెల్, ముత్తూట్ ఫైనాన్స్, డైకిన్ ఎసి సంస్థలు క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించి వాటికి అవసరమైన సిబ్బంది కోసం అభ్యర్థులను ఎంపిక చేసుకున్నట్లు తెలిపారు. ఈ జాబ్ మేళాకు వివిధ కళాశాలల నుంచి మొత్తం 44 మంది అభ్యర్థులు హాజరు కాగా వీరిలో 25 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కిల్ హబ్ కోఆర్డినేటర్ వి.మనోజ్, ఐటిఐ అధ్యాపకులు సిబ్బంది పాల్గొన్నారు.

స్వర్ణకారుల కార్పొరేషన్ ఏర్పాటు పట్ల హర్షం

ప్రజాశక్తి - పెనుమంట్ర

స్వర్ణకారులకు టిడిపి ఇచ్చిన హామీ మేరకు స్వర్ణకారుల కార్పొరేషన్ ఏర్పాటు చేయడం పట్ల మండలంలోని పలువురు స్వర్ణకారులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, ఆచంట నియోజకవర్గ ఎంఎల్ఎ పితాని సత్యనారాయణలకు కృతజ్ఞతలు తెలుపుతూ వారి చిత్రపటానికి పాలాభిషేకం మార్టేరు సెంటర్‌లో చేశారు. ఈ కార్యక్రమంలో స్వర్ణకార సంఘ నాయకులు ముండూరు రాజేష్, అలుగులు రాము, కొమ్మూరు రమణ, చెల్లూరు జేజీ, మండ నాని, తంపాల ప్రసాద్, గోపి వీరబాబు, ఉప్పులపల్లి హరి, కోనూరి రామచంద్రరావు, కోటి నాగబాబు, కోటి కుమార్, అలుగోలు మురళీ, అనుపోజు తాతబ్బాయి పాల్గొన్నారు.

నూతన దుకాణాలు నిర్మించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్

ఆచంట : శుక్రవారం సంత మార్కెట్ శిథిలావస్థలో ఉన్న దుకాణాల సముదాయాలను తొలగించి నూతన దుకాణాలను నిర్మించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక అమరవీరుల కార్యాలయంలో సిపిఎం మండల శాఖ మహాసభ మంగళవారం నిర్వహించారు. కొత్తూరు శాఖా కార్యదర్శిగా ఎనిమిదిన సత్యనారాయణ మరోసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు చొప్పల మోహన్, వద్దిపర్తి శ్రీనివాస్, తలుపూరి బుల్లబ్బాయి, కుసుమే జయరాజు పాల్గొన్నారు.

మహిళల తాళిబొట్లు తెంపేలా మద్యం పాలసీ

సిపిఎం పట్టణ కార్యదర్శి వాసుదేవరావు

భీమవరం : ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన మద్యం విధానం మహిళల తాళిబొట్లను తెంపే విధంగా ఉందని సిపిఎం భీమవరం పట్టణ కార్యదర్శి బి.వాసుదేవరావు విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం మద్యాన్ని ఆదాయ వనరుగా చూడటం వల్ల క్రైమ్ రేటు పెరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆరవ వార్డు సిపిఎం శాఖ మహాసభ మునిసిపల్ అప్పారావు అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. నూతన కార్యదర్శిగా బొక్క సత్యనారాయణను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బి.విజయలక్ష్మి, బి.శాంతి కుమారి, బి.చైతన్య ప్రసాద్, మెలపర్తి అప్పారావు పాల్గొన్నారు.

భారీ అన్నసమారాధన

మొగల్తూరు : మొగల్తూరు పంచాయతీ పరిధిలోని ఉచిత కాలవ సమీపంలో ఉన్న సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో సోమవారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. గ్రామానికి చెందిన గుడాల కృష్ణమూర్తి, శశిరేఖ దంపతుల కుమారులు గుడాల ఉదయభాస్కరరావు, వెంకటలక్ష్మి దంపతులు ఆలయంలో మయూర వాహనం శివలింగ ద్వారపాలకుల విగ్రహాలను ప్రతిష్ఠాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్న సమారాధనలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. నిర్వాహకులు ప్రజలకు ఎటువంటి అసౌకర్యాలు కలకుండా నిర్వహణ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ఆధార్ సేవలను వినియోగించుకోండి

ఉండి : మండలంలో మంగళవారం ప్రారంభించిన ఆధార్ ప్రత్యేక క్యాంపులను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఉండి ఎండిఒ ఎస్.రవీంద్ర అన్నారు. ఉండి మండలంలో ఆధార్ సేవలను తహశీల్దార్ ఆఫీస్ రోడ్‌లో ఉన్న సచివాలయం 2లో, పాత పంచాయతీ ఆఫీస్‌లో సచివాలయం 4లో, ఎన్ఆర్‌పి అగ్రహారం సచివాలయం, యడగండి సచివాలయంలో ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. ఉండి రెండో సచివాలయం డిజిటల్ అసిస్టెంట్ కందుల దేవి, నాలుగో సచివాలయం డిజిటల్ అసిస్టెంట్ జిమాని మాట్లాడుతూ ఆధార్ కార్డు సంబంధించిన అన్ని సేవలు సచివాలయం పరిధిలో చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉండి పంచాయతీ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

అధ్వానంగా రోడ్లు

భీమవరం టౌన్: భయంకరమైన దుస్థితిలో రాష్ట్రంలోని రోడ్లు ఉన్నాయని, రోడ్లు ప్రమాదాల్లో ఆంధ్రప్రదేశ్ మొదటిస్థానంలో ఉందని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. రోడ్ల దుస్థితి ఆరు మాసాల్లో మెరుగుపరుస్తామని పెను ఉద్యమాలు నిర్మిస్తామని హెచ్చరించారు. జిల్లా కేంద్రమైన భీమవరం చేరుకునే ప్రధాన రహదారులను తక్షణమే ఆధునీకరించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఆధ్వర్యంలో ప్రకాశంచౌక్‌లో చేపట్టిన 32 గంటల నిరాహార దీక్షలను ముప్పాళ్ల నాగేశ్వరరావు, సిపిఐ రాష్ట్ర కార్యవర్గసభ్యులు పి.హరనాథరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భీమవరంలో కేంద్రమంత్రి, సమీపంలోనే రాష్ట్ర మంత్రి ఉన్నారని, వారు రోడ్ల దుస్థితికి మొదలు పరిరక్షించాలని ప్రయత్నించాలని డిమాండ్ చేశారు. బుధవారం నిరసన దీక్ష ముగింపుకు కేంద్ర మంత్రి, రాష్ట్ర మంత్రి విచ్చేసి ప్రజలకు హామీ ఇస్తారని ఆశాభావం ఆయన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కలిశెట్టి వెంకటేశ్వరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు, ఎం.సీతారాంప్రసాద్, కళింగ లక్ష్మణరావు పాల్గొన్నారు.

ఉచిత మెడికల్ క్యాంప్ వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

గుండె జబ్బులున్న చిన్నపిల్లలకు ఉచితంగా మెడికల్ క్యాంప్ మంగళవారం మెంటేవారితోటలోని పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో నిర్వహించినట్లు వసుధ ఫౌండేషన్ కో ఆర్డినేటర్ ఇందుకూరి ప్రసాదరాజు తెలిపారు. ఈ క్యాంప్‌లో సుమారు 30 మందికి పరీక్షలు చేసి 2డి ఎకో నిర్వహించారు. విజయవాడ ఆంధ్ర హాస్పిటల్ నుంచి వచ్చి సేవలందిస్తున్న డాక్టర్ విక్రమ్ వైద్య బృందానికి ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. గతంలో హార్ట్ సర్జరీ చేయించిన 10 మంది పిల్లలకు ఈరోజు టెస్టులు నిర్వహించగా వారికి గుండె పనితీరు మెరుగైనట్లు నిర్ధారించారు. మెంటేవారితోటలోని పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో ఎంబిబిఎస్ డాక్టరు ఉచిత రెగ్యులర్ వైద్యసేవాకేంద్రం, డయాగ్నోస్టిక్ సెంటర్, డాక్టర్ రిఫరెన్స్ మేరకు ఉచితంగా ఇసిజి, అత్యంత తక్కువ ధరలతో మందుల ఉచ్చేందుకు జనరిక్ మెడికల్ షాపు నిర్వహిస్తున్నట్లు అల్లూరి సీతారామరాజు భగత్ సింగ్ సేవా విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ చైర్మన్ బి.బలరాం తెలిపారు. ఈ కేంద్రాన్ని అందరూ వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

హోటళ్లలో తనిఖీలు

ప్రజాశక్తి - మొగల్తూరు

హోటల్స్, ఇతర వ్యాపార సంస్థలలో వ్యాపార సంబంధమైన గ్యాస్ సిలిండర్లను వినియోగించాలని తహశీల్దార్ కె.రాజకిషోర్ సూచించారు. మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో మంగళవారం సాయంత్రం పలు హోటల్స్‌లో ఆయన తనిఖీలు నిర్వహించారు. గృహ అవసరాలకు వినియోగించే వంటగ్యాస్‌ను గుర్తించి యజమానిపై కేసు నమోదు చేసి, సిలిండర్ స్వాధీనం చేసుకున్నామని తహశీల్దార్ తెలిపారు. ఈ తనిఖీల్లో డిప్యూటీ తహశీల్దార్ సంధ్య, ఆర్ఐ నిరంజన్ ఉన్నారు.

మహిళ అదృశ్యం

ప్రజాశక్తి - తణుకు రూరల్

భార్యా, భర్తల మధ్య మనస్పర్థల కారణంగా భార్య అలిగి తన కుమార్తెను తీసుకొని ఇంట్లో నుంచి వెళ్లిపోయిన ఘటన తణుకు మండలం వేల్పూరు గ్రామంలో చోటుచేసుకుంది. తణుకు రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వేల్పూరు గ్రామానికి చెందిన నల్లి నగేష్ పదకొండు సంవత్సరాల క్రితం నల్లి దుర్గా లక్ష్మి అనే ఆమెతో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో గతనెల 29న దుర్గా లక్ష్మి తన ఇద్దరు పిల్లల్లో ఒకరిని తీసుకొని ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఇప్పటి వరకు ఆమె ఆచూకీ తెలియకపోవడంతో మంగళవారం నల్లి నగేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు తణుకు రూరల్ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

అధిక ధరలు నియంత్రించండి

సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం

ప్రజాశక్తి - ఆకివీడు

పెరుగుతున్న నిత్యవసర సరుకుల ధరలను నియంత్రించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక 14వ వార్డు జవహర్ పేటలో జరిగిన శాఖ మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. తొలుత సభ ప్రారంభంలో సిపిఎం పతాకాన్ని సీనియర్ సభ్యులు బంకా రాజు ఆవిష్కరించారు. సిపిఎం అఖిలభారత ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, సీనియర్ నాయకులు ఆర్ఎస్‌ల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన సభలో జిల్లా కార్యదర్శి బలరాం మాట్లాడుతూ రాష్ట్రంలో నిత్యవసరాలైన ఆహార ధాన్యాలు, నూనెల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయన్నారు. గత మూడు నెలలగా 20 నుంచి 40 శాతం వరకూ ధరలు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. వాటి నియంత్రణకు ప్రభుత్వం ఎటువంటి చర్యలూ తీసుకోవడం లేదని, తక్షణమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లక్షలాదిమంది కార్మికులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధిని కల్పిస్తున్న విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రయివేటీకరించాలనే భావన మార్చుకోవాలన్నారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమించి విశాఖ ఉక్కును కాపాడుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. అనంతరం శాఖ నూతన కార్యదర్శిగా డోకల రవితేజ, సభ్యులుగా ఎస్.సూరిబాబు, బివి.వర్మ, బంక రాజు, చెన్న పాపారావు, జి.ధనుష్, అర్జీ సతీష్‌లు ఎన్నికయ్యారు.

ఆసుపత్రికి ఫ్రిజ్ అందజేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

రిఫ్రిజిరేటర్ అందజేత

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం ఎన్‌టిఆర్ కాలనీ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌కి రోటరీ క్లబ్ రూ.13 వేలు విలువ చేసే రిఫ్రిజిరేటర్‌ను అందించారు. ఈ సందర్భంగా నరసాపురం రోటరీ క్లబ్ అధ్యక్షురాలు గన్నాబత్తుల సత్యవతి ప్రారంభించి మాట్లాడారు. చిన్నపిల్లలు, గర్భిణులకు అందించే ముఖ్యమైన వ్యాక్సిన్లు భద్రపరిచేందుకు ఫ్రిడ్జ్ లేకపోవడంతో గుర్తించి రోటరీ క్లబ్ ద్వారా అందించామన్నారు. భవిష్యత్‌లో మరెన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని సత్యవతి తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు బొమ్మిడి సూర్యకుమారి, అత్మూరి రమా, అందే కృష్ణ, విజయ్ కుమార్, కేజ్ ఎస్-ఎల్.కుమారి, వైద్యురాలు పి.సోనియా పాల్గొన్నారు.

వ్యవసాయ పరిశోధనా స్థానం సందర్శన

ప్రజాశక్తి - పెనుమంట్ర

భారత వ్యవసాయ పరిశోధనా మండలి, కొత్త ఢిల్లీకి చెందిన ప్రధాన శాస్త్రవేత్త(విత్తన అభివృద్ధి శాస్త్రం) డాక్టర్ సందీప్ కుమార్ లాల్, పలువురు శాస్త్రవేత్తలు మంగళవారం స్థానిక మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రాన్ని సందర్శించారు. ఈ మేరకు డాక్టర్ అశ్వినీకుమార్, ప్రధాన శాస్త్రవేత్త(విత్తన అభివృద్ధి శాస్త్రం), కర్నల్ డాక్టర్ భోజరాజ నాయక్, సీనియర్ శాస్త్రవేత్త(విత్తన అభివృద్ధి శాస్త్రం), బెంగళూరు, డాక్టర్ ప్రతాప్ భాన్‌సింగ్, అసిస్టెంట్ ప్రొఫెసర్, ఎంపియుఎటి, ఉదయపూర్, డాక్టర్ వినేష్, శాస్త్రవేత్త(విత్తన అభివృద్ధి శాస్త్రం), మౌ, ఉత్తరప్రదేశ్ వారితో కూడిన శాస్త్రవేత్తల బృందం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానాన్ని సందర్శించారు. ఈ పర్యటనలో రాష్ట్రంలో సాగులో ఉన్న వరి రకాల ప్రదర్శనా క్షేత్రాన్ని సందర్శించి వివరాలను వారు తెలుసుకున్నారు. పరిశోధనా కేంద్రంలో ఉన్న మూల విత్తనోత్పత్తి క్షేత్రంలోని ప్రజననకారుని విత్తనోత్పత్తి క్షేత్రాలు, విత్తన గిడ్డంగి, విత్తన శుద్ధి కర్మాగారాలను సందర్శించి అక్కడ స్థానిక శాస్త్రవేత్తలకు తగు సలహాలు, సూచనలు అందించారు. ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం తరుపున విచ్చేసిన విత్తన సంచాలకులు డాక్టర్ వై.సతీష్, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కృష్ణా నాయక్, పరిశోధన సహ సంచాలకులు డాక్టర్ టి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

మెరిట్ విద్యార్థులకు నగదు అందజేత

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

పాలకొల్లుకు చెందిన ప్రముఖ దాత గాది సుబ్బారావు మండలంలోని వెలివెల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి పరీక్షలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బుధవారం నగదు బహుమతి, జ్ఞాపికలు అందజేశారు. 2022-23 విద్యా సంవత్సరానికి ప్రథమ స్థానం పొందిన కండిబోయిన ఆదిత్య వెంకట సాయి, ద్వితీయ స్థానం పొందిన గుమ్మాపు జూబిలకు అందజేశారు. 2023-24 విద్యా సంవత్సరానికి ప్రథమ స్థానం పొందిన ఉన్నమట్ల సంజీవ్ కుమార్, ద్వితీయ స్థానం పొందిన ఇంజేటి శైలజలకు నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శ్రీరామ్మూర్తి, తొంటా చలపతిరావు, నర్సింహులు, హనుమ, సరోజిని, చైతన్య, సత్తిబాబు, గ్రామస్థులు పాల్గొన్నారు.

అనారోగ్య బాధితులకు సాయం

ప్రజాశక్తి - పాలకొల్లు

అనారోగ్యంతో బాధపడుతున్న ముగ్గురు బాధితులకు వైద్య ఖర్చుల నిమిత్తం వసుధ ఫౌండేషన్ రూ.40 వేల ఆర్థిక సాయం అందించింది. పాలకొల్లులో జరిగిన కార్యక్రమంలో బుధవారం పాలకొల్లు క్షత్రియ సంఘం ఉపాధ్యక్షులు చేకూరి సూరిబాబు చేతుల మీదుగా బాధితులకు ఆర్థిక సాయం అందజేశారు. పోడూరు మండలం జున్నూరుకి చెందిన గాదిరాజు అమ్మాజీ కొంతకాలంగా కేన్సర్‌తో బాధపడుతుంది. ఆమెకు వసుధ ఫౌండేషన్ ద్వారా రూ.20 వేల ఆర్థిక సాయం, కవిటంకి చెందిన మేడపాటి సూర్యకుమారి బెస్ట్ కేన్సర్‌తో బాధపడుతుంది. ఆమెకు రూ.10 వేల ఆర్థిక సాయం, పాలకొల్లు పట్టణానికి చెందిన సమటపు హేమంత్ సాయి అనే 6 ఏళ్ల బాలుడుకు పేగు కణితి ఆపరేషన్ నిమిత్తం రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. వసుధ ఫౌండేషన్ ఏరియా కన్వీనర్ పెనుమత్స బుద్ధరాజు, పెనుమత్స జగపతి సూర్యనారాయణ రాజు పాల్గొన్నారు.

పోలీసు అమరవీరుల సేవలు చిరస్మరణీయం

ట్రాఫిక్ సిఐ నారాయణ మూర్తి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

యువ చైతన్యమే.. చైతన్య భారతదేశమని, యువతపైనే నేటి దేశం ఆధారపడి ఉందని, యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, నైతిక విలువలతో ముందుకు సాగాలని, పోలీసులతోపాటు పెద్దల పట్ల గౌరవంగా ఉండాలని ట్రాఫిక్ సిఐ నారాయణమూర్తి అన్నారు. మంగళవారం శ్రీవిజ్ఞానవేదిక, జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. పోలీసులు ఎవరిపైనా కక్ష సాధింపుగా ఉండరని, ప్రజా రక్షణే ధ్యేయంగా ముందుకు వెళతామని సిఐ అన్నారు. ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అనురాధ మాట్లాడుతూ త్యాగాలు చేసిన పోలీసు అమరవీరులను స్మరించుకోవడం ప్రజలందరి బాధ్యత అని, అనునిత్యం ప్రజా రక్షణలో పోలీసు సేవలు ఎనలేనివని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ నిరంతరం ప్రజా రక్షణలో ఉంటూ విధి నిర్వహణలో బాధ్యతలు నిర్వర్తించే వారే పోలీసులన్నారు. అనంతరం విద్యార్థులతో కళాశాల నుంచి జెపి రోడ్డులోని గాంధీజీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు మహేష్, ఎఎ సురేష్ పాల్గొన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ మెంటే హరినాథ్ బాబు, పీజీ డైరెక్టర్ డాక్టర్ తోట రామూర్తి, ప్రిన్సిపల్ కె.రాఘవ, నాచు శ్రీవల్లి, కె.చాయ దేవి, కె.జ్యోతి, పి.సుధాకర్ పాల్గొన్నారు.

యాత్రికులకు మెరుగైన సౌకర్యాలందించాలి

ఆర్‌డిఒ దాసిరాజు

పాలకొల్లు : నవంబర్ 2వ తేదీ నుంచి కార్తీకమాసంలో పాలకొల్లు క్షీర రామలింగేశ్వర స్వామి ఆలయానికి వచ్చే యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని శాఖలు సమన్వయంగా పర్యవేక్షించాలని నరసాపురం ఆర్‌డిఒ దాసిరాజు కోరారు. స్థానిక క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయంలో బుధవారం వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆర్‌డిఒ మాట్లాడుతూ దేవదాయ శాఖతో పాటు పోలీస్, మున్సిపల్, రెవెన్యూ అధికారులు యాత్రికులకు ఏర్పాట్లు పర్యవేక్షించాలని కోరారు. జిల్లా నుంచి కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున ప్రత్యేక బస్సులు, ఆర్‌టిసి, కార్లలో రోజూ వందలాదిగా భక్తులు వస్తారని, పగలు, రాత్రి వారికి ఎటువంటి ఇబ్బంది లేకుండా దర్శనం త్వరగా అయ్యేలా ఏర్పాట్లు చూడాలని కోరారు. అవసరమైతే స్వచ్ఛంద సంస్థల సహకారం కూడా తీసుకోవాలని కోరారు. స్వచ్ఛంద సంస్థలు భోజనం, ప్రసాదాల ఏర్పాట్లు చేస్తాయని, అక్కడ తొక్కిసలాట లేకుండా, యాత్రికులకు అసౌకర్యం కలగకుండా చూడాలని కోరారు. మున్సిపాలిటీ పారిశుధ్యం విషయంలో ఎప్పటికప్పుడు జాగ్రత్తగా ఉండాలని, తాగునీరు సరఫరా చూడాలని కోరారు. ట్రాఫిక్‌కు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా చూడాలని పోలీసులను కోరారు. సమావేశంలో దేవదాయశాఖ ఏసి సుబ్బారావు, ఇఒ ముచ్చర్ల శ్రీనివాస్, తహశీల్దార్ దుర్గ కిషోర్, ఎస్ఐ బాదం శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ విజయ సారథి పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ గణాంక దినోత్సవం

పాలకొల్లు : స్థానిక బిఆర్ఆర్, జికెఆర్ చాంబర్స్ డిగ్రీ కళాశాలలో బుధవారం ప్రపంచ గణాంక దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వీరవాసరం తహశీల్దార్ ఆఫీస్ స్టాటికల్ ఆఫీసర్ బి.నాగమణి పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిని సభకు పరిచయం చేశారు. ముఖ్య అతిథి నాగమణి మాట్లాడుతూ సుస్థిరాభివృద్ధికి, నూతన ఉత్సవానికి, దేశ ఆర్థిక పురోభివృద్ధికి, పారిశ్రామిక అభివృద్ధికి, గణాంకాలు ఎంతో అవసరమని, గణాంక శాస్త్రం చదివిన వారికి ప్రభుత్వ, ప్రయివేటు సంస్థలలో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నాయని చెప్పారు. ప్రభుత్వాలు, అనేక సంస్థలు స్టాటస్టిక్స్‌ని అత్యధికంగా ప్రభుత్వ, ప్రయివేటు సేవలకు ఉపయోగించుకుంటున్నారని చెప్పారు. కళాశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ సమకాలీన జాతీయ ప్రాముఖ్యత ఇతివృత్తంతో ప్రతి సంవత్సరం స్టాటిస్టిక్స్ డే జరుపుకుంటారన్నారు. గణాంకాల దినోత్సవం, 2024 థీమ్ 'నిర్ణయం తీసుకోవడం కోసం డేటా వినియోగం' ఏదైనా రంగంలో సమాచారంతో కూడిన నిర్ణయాలు తీసుకోవడానికి డేటా ఆధారిత నిర్ణయం తీసుకోవడం అనే భావన ముఖ్యమైనదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్టాటిస్టిక్స్ ఇన్‌ఛార్జి దీప్తి పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికే గ్రామసభలు

కాళ్ల : గ్రామ సభలో మాట్లాడుతున్న తహశీల్దార్

కాళ్ల : రెవెన్యూ సమస్యల పరిష్కారానికై ప్రభుత్వం గ్రామ సభలు నిర్వహిస్తుందని, వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ జి.సుందర్ సింగ్ అన్నారు. కాళ్ల మండలంలోని ప్రాతళ్లమెరక గ్రామపంచాయతీ వద్ద రెవెన్యూ గ్రామసభ మంగళవారం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రీ సర్వే ప్రాజెక్టులో సర్వే పూర్తయిన గ్రామాల్లో వివిధ భూ సమస్యలపై రైతులతో గ్రామసభ నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కంతేటి శ్రీనివాసరాజు, కంతేటి సుబ్బరాజు, కార్యదర్శి బస్వాని యేసు బాబు, విఆర్ఒ ప్రశాంత్ బాబు, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఉండి : గ్రామాల్లోని భూ సమస్యలను పరిష్కరించి ప్రజల మధ్య ఎటువంటి విభేదాలు లేకుండా చూసేందుకే రాష్ట్ర ప్రభుత్వం భూ రీ సర్వేను తీసుకువచ్చిందని ఉండి తహశీల్దార్ కావడి నాగార్జున అన్నారు. మంగళవారం ఉండి మండలం వాండ్రం గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రైతులు భూ సమస్యలను అధిగమించేందుకు క్షేత్రస్థాయిలో రీ సర్వే ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. గ్రామపంచాయతీ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో సుమారు 20 మంది రైతులు గతంలో జరిగిన రీ సర్వేలో సమస్యలు ఉన్నట్లు తమ దృష్టికి తీసుకువచ్చారని, ఈ తప్పిదాలను సరిచేసి వారి సమస్యలను పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు కృషి చేయాలని ఆయన ఆదేశించారు. సర్పంచి దాసరి వెంకటకృష్ణ పాల్గొన్నారు.

ఆర్‌టిసి ఆదాయం రూ.48 లక్షలు

పోస్టర్ ఆవిష్కరణలో జిల్లా ప్రజా రవాణాధికారి వరప్రసాద్

ప్రజాశక్తి - భీమవరం టౌన్

దసరా పండుగ సందర్భంగా ఆర్‌టిసి రూ.48 లక్షల అదనపు ఆదాయాన్ని సంపాదించినట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎన్‌విఆర్.వరప్రసాద్ తెలిపారు. జిల్లా ప్రజా రవాణా కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దసరా పండుగ సందర్భంగా హైదరాబాద్ నుంచి రాష్ట్రానికి వచ్చే ప్రయాణికుల సౌకర్యార్థం రాను పోను 218 బస్సులను నడిపినట్లు ఆయన తెలిపారు. ప్రయాణికులపై ఎటువంటి అదనపు ఛార్జీలు మోపకుండా సాధారణ ఛార్జీలతోనే హైదరాబాద్ నుంచి జిల్లాకు, అలాగే జిల్లా నుంచి హైదరాబాద్‌కు బస్సులను నడిపి ప్రయాణికుల అవసరాలను తీర్చడంతోపాటు రూ.48 లక్షల అదనపు ఆదాయాన్ని సమకూర్చుకున్నట్లు ఆయన తెలిపారు. కార్తీకమాసం సందర్భంగా నాలుగు ఆదివారాలు పంచారామ క్షేత్రదర్శని టూర్ ప్యాకేజీ అందుబాటులోకి తీసుకువచ్చినట్లు ఆయన అన్నారు. ఆదివారం జిల్లాలోని డిపోల నుంచి బయలుదేరి సోమవారం ఒక్కరోజులోనే అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోట దర్శించుకుని వచ్చేవిధంగా ప్యాకేజీని అందుబాటులోకి తీసుకుని వచ్చినట్లు తెలిపారు. టూర్ ప్యాకేజీలో టికెట్ రేట్ల వివరములు.. పల్లె వెలుగు 720, ఎక్స్‌ప్రెస్ 900, అల్ట్రా డీలక్స్ 1100, సూపర్ లగ్జరీ 1200లుగా నిర్ణయించినట్లు తెలిపారు.

శబరిమలై, శ్రీశైలం యాత్రలు చేయు భక్తులకు అద్దె ప్రాతిపదికన అల్ట్రా డీలక్స్, సూపర్ లగ్జరీ బస్సులను ఇవ్వనున్నట్లు ఆయన అన్నారు. ఏ గ్రామం నుంచి అయినా 30 లేదా 40 మంది భక్తులు, ప్రయాణికులు ఉన్న యెడల వారి గ్రామం నుంచి బస్సులను ఏర్పాటు చేయబడునన్నారు. పట్టణంలో భీమవరంలో ఉన్న పాత బస్టాండ్‌కి కొన్ని సర్వీస్లను ప్రయాణికుల సౌకర్యార్థం నడుపుతున్నట్లు ఆయన తెలిపారు. నరసాపురం నుంచి రాయచూర్‌కు నూతన సర్వీసును ప్రారంభించుటకు అనుమతి లభించిందని నవంబర్ మొదటి వారంలో ఆ సర్వీసును ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పర్సనల్ ఆఫీసర్ ఎల్.గీతావాణి, భీమవరం డిపో మేనేజర్ సత్యనారాయణమూర్తి, నరసాపురం డిపో మేనేజర్ ఎస్.సుబ్బన్న రెడ్డి, తణుకు డిపో మేనేజర్ ఎస్.గిరిధర్‌కుమార్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

నరసాపురం: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు, డెంగీ, వైరల్ ఫీవర్స్ వంటి జ్వరాలు వ్యాప్తి చెందకుండా హెల్త్ సిబ్బంది చర్యలు తీసుకోవాలని నరసాపురం మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య అన్నారు. మంగళవారం కమిషనర్ ఛాంబర్‌లో శానిటరీ సెక్రటరీలు, ఎఎన్ఎంలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ అంజయ్య మాట్లాడుతూ హెల్త్ సిబ్బంది ఫీవర్ సర్వే చేపట్టి, జ్వర రోగులను గుర్తించాలన్నారు. వార్డులో ప్రజలకు ఒఆర్ఎస్ ప్యాకెట్లు, మందులు అందిచాలన్నారు. వైద్య సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రజా పరిపాలన గాలికొదిలేశారు

మాజీ మంత్రి కారుమూరి

తణుకు : రాష్ట్రవ్యాప్తంగా పరిపాలన స్తంభించిపోయిందని, ప్రజాపరిపాలన గాలికొదిలేశారని తణుకు మాజీ మంత్రి డాక్టర్ కారుమూరి వెంకటనాగేశ్వరరావు ప్రభుత్వాన్ని విమర్శించారు. మంగళవారం స్థానిక కార్యాలయం వద్ద విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కారుమూరి మాట్లాడుతూ దాచుకో, దోచుకో, పంచుకో అనేదాని మీదనే కింది నుంచి పై స్థాయి వరకు ఆలోచనతో ఉన్నారన్నారు. ప్రజా పరిపాలన గాలికి వదిలేశారని అనడానికి నిదర్శనం విజయనగరం జిల్లా గుర్ల గ్రామం అన్నారు. పారిశుధ్యం, మంచినీరు నాణ్యతా లోపం వల్ల 16 మంది ప్రాణాలు డయేరియా వల్ల పోతే కనీసం ఈ ప్రభుత్వానికి చీమకుట్టినట్టుగా కూడా లేదని అన్నారు. ఈ రాష్ట్ర ప్రభుత్వం ఉన్నదా లేదా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో పెనుమత్స సుబ్బరాజు, మంగెన సూర్య, నాయకులు పాల్గొన్నారు.

గ్రామాలాభివృద్ధికి పెద్దపీట

ఉండి : గ్రామాలాభివృద్ధికి రాష్ట్రప్రభుత్వం పెద్దపీట వేస్తుందని టిడిపి వాండ్రం గ్రామ అధ్యక్షులు కందుల రాధా బలరామకృష్ణ శ్రీనివాస్ యాదవ్, చినపుల్లేరు గ్రామ సర్పంచి పెన్మెత్స సావిత్రమ్మ అన్నారు. మంగళవారం ఉండి మండలం వాండ్రం గ్రామంలో రూ.15 లక్షల నిధులతో సీసీ రోడ్ల నిర్మాణానికి, చినపుల్లేరు గ్రామంలో రూ.5 లక్షల నిధులతో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ కట్టుబడి ఉన్నారన్నారు. గ్రామాలలో రోడ్ల సమస్యను, పారిశుధ్య సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. చినపుల్లేరు గ్రామ ఉపసర్పంచి బొర్రా సువర్ణ రాజు పాల్గొన్నారు.

గోల్ సెట్టింగ్‌పై అవగాహన

గణపవరం: గణపవరం డిగ్రీ కాలేజీలో మంగళవారం విద్యార్థులకు గోల్ సెట్టింగ్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కాలేజ్ ప్రిన్సిపల్ పి.నిర్మలాకుమారి మాట్లాడుతూ విద్యార్థి దశనుండే ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకొని చదువుకోవాలని అన్నారు. అన్ని రంగాల్లో రాణించాలని తెలిపారు. జాన్ కెనడి, పట్టాభి, శ్రీనివాస్ రావు విద్యార్థులు పాల్గొన్నారు

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థులు ఎంపిక

గణపవరం : గణపవరం జిల్లా పరిషత్ హైస్కూల్‌కి చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి వాకింగ్ పోటీలకు ఎంపికైనట్లు హైస్కూల్ పీడీ పద్మావతి మంగళవారం తెలిపారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాస్థాయి పోటీలు జిసిపి ఇ.గోపన్నపాలెంలో నిర్వహించిన పోటీలలో గణపవరం హైస్కూలుకు చెందిన విద్యార్థులు ఐదు కిలోమీటర్ల వాకింగ్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను పద్మావతి, హెచ్ఎం మార్తి, ఉపాధ్యాయులు అభినందించారు.

పాస్‌పోర్టు పోయినది

పశ్చిమగోదావరి జిల్లా, గణపవరం మండలం, గణపవరం గ్రామ కాపురస్తులైన యామ్ముల మార్తమ్మ, భర్త: విజయ్ కుమార్ అను నేను నా యొక్క పాస్‌పోర్టు గణపవరం SBI సెంటర్లో జిరాక్స్ తీయించుకొని మా ఇంటికి వచ్చే మార్గ మధ్యలో పాస్‌పోర్టు నెం. K2278960 గల పాస్‌పోర్టు మరియు జిరాక్స్‌తో సహా కవర్లో పెట్టుకొని మా ఇంటికి వచ్చే మార్గ మధ్యలో ఎక్కడ పడిపోయిందో తెలియదు. ఎంత వెతికిన దొరకలేదు. దొరికినవారు ఈక్రింది ఫోన్ నెంబరుకు తెలియజేయగలరు.

అడ్రస్: యామ్ముల మార్తమ్మ
భర్త: విజయ్ కుమార్
గణపవరం గ్రామం, గణపవరం మండలం
పశ్చిమగోదావరి జిల్లా
సెల్: 83415 18722

PUBLIC NOTICE

Under the instruction of my client M/S Shriram Finance Ltd. Aswaraopeta Branch Rep. by its Branch Manager it is stated that Bonthu Ravindra Babu, s/o Thathaiah, 37 years, R/o H.No. 1-27, Ambedkar veedhi, Near MRO Office, Jeelugumilli village and Mandal, Eluru District. AP, is creating mortgage against his property shown below as security for the proposed trade loan. If anybody having any objection, they can send the objections to me or to my client within 3 days from the date of publication of this notice and further objections if any shall not bind my client.

SHEDULE OF THE PROPERTY

Vacant house site to an extent of 269.63 Sq. yards or 225.45 Sq. Meters bearing plot no.3 bearing R.S.No. 406/2, R.S.No. 406/3 (vide approved layout L.P.No.3/2022/1142,dt. 08/05/2023) situated with in the Municipal limits of Jangareddigudem village and Mandal, Eluru District, SRO limits of Jangareddigudem bounded by:

EAST : Meters 11.44 Puntha Road
SOUTH : Meters 19.50 Plot no.4 place
WEST : Meters 11.58 Plot no.6 place
NORTH : Meters 19.80 Plot no.2 place

P.GANESH BABU
Advocate
Kothagudem
Dt: 22-10-2024
Kothagudem
Cell:98492 46278